ప్రజాశక్తి
శనివారం 28 జనవరి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సర్దుబాటుపై ఖేదం-మోదం



గుంటూరు మండలానికి కేటాయించిన వారికి నియామక పత్రాలిస్తున్న ఎంఇఒ ఖుద్దూస్

- అలవెన్సుతో 424 మంది ఉపాధ్యాయుల ఎంపిక
- 445 మంది మిగులు ఉపాధ్యాయులకు స్థానచలనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను నివారించేందుకు సీనియర్ ఎస్‌జిటిలకు నెలకు రూ.2500 అలవెన్స్‌తో స్కూల్ అసిస్టెంట్లుగా నియమించేందుకు చేపట్టిన కౌన్సెలింగ్‌లో 424 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరు శుక్రవారం నుంచి కొత్తగా పోస్టింగ్ పొందిన పాఠశాలల్లో విధుల్లో ప్రారంభించారు. గుంటూరు మండలానికి కేటాయించిన 13 మందికి ఉత్తర్వులను ఎంఇఒ ఖుద్దూస్ అందజేశారు.

పాఠశాలల్లో ఉన్న ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకుండా ఉన్న వారినే సర్దుబాటు చేయడంపై పలువురు ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అదనంగా ఉన్నట్లు గుర్తించిన 443 మంది స్కూల్ అసిస్టెంట్లను అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు శుక్రవారం ఎంఇఒలకు చేరాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల రేషియో ప్రాతిపదికన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ మండలాల్లోని పాఠశాలల్లో పని చేస్తున్న 443 మందిని పలు పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఈ సర్దుబాటుపై కొంతమంది ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము పనిచేస్తున్న ప్రదేశాల నుంచి విద్యా సంవత్సరం మధ్యలో ఆకస్మికంగా మార్చడాన్ని అంగీకరించడం లేదు. కుటుంబ సభ్యుల అనారోగ్య కారణాలు, ఇతర పలు కారణాల వల్ల తాము దూర ప్రదేశాలకు వెళ్లలేకపోతున్నామని మిగులు ఉపాధ్యాయులు చెబుతున్నారు. పనిచేస్తున్న ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వెళ్లడానికి పలువురు విముఖత వ్యక్తం చేస్తున్నారు. వీరిలో శుక్రవారం కొంత మంది డిఇఒను శుక్రవారం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వీరితోపాటు సబ్జెక్టు కన్వర్షన్ కోరుకున్న మరో 52 మంది ఉపాధ్యాయులకు వారు కోరుకున్న విధంగా సబ్జెక్టు కన్వర్షన్ చేసి పాఠశాలల్లో నియమించారు.

ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీకి సీనియార్టీ ప్రాతిపదికన సీనియర్ ఎస్‌జిటిలకు ప్రమోషన్లు కల్పించేందుకు గతేడాది అక్టోబర్లో ఉమ్మడి జిల్లాలోని టీచర్లకు గుంటూరు డిఇఒ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే కొంతమంది ఉపాధ్యాయులు న్యాయస్థానాలకు వెళ్లడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన నెలకు రూ.2500 టీచర్ అలవెన్స్‌పై సీనియర్ ఎస్‌జిటిలను హైస్కూలలో స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపిక చేశారు. వీరిలో ఎక్కువ మంది ప్రమోషన్ కోరుకున్న వారున్నారు. న్యాయస్థానంలో వివాదాలు పరిష్కారమైతే వీరందరి ప్రమోషన్లు లాంఛనప్రాయమని అధికార వర్గాలు తెలిపాయి.



చిన్ననాటి స్నేహితురాలుతో జమున





దుగ్గిరాల రథం బజార్లో జమున కుటుంబం నివసించిన ఇల్లు, జమున చదివిన హైస్కూల్

తారల్లోకి వెండితెర సత్యభామ

- దుగ్గిరాలకు పలుమార్లు రాకపోకలు
- స్థానిక చిన్ననాటి స్నేహితురాలితో కడవరకూ ముచ్చట్లు
- కళామతల్లి ముద్దుబిడ్డ జమునకు జిల్లాతో ప్రత్యేక అనుబంధం

ప్రజాశక్తి - దుగ్గిరాల, తెనాలి

కళామతల్లి ముద్దుబిడ్డ, అలనాటి కథానాయిక జమున శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. తెలుగు, తమిళ భాషల్లో దాదాపు 200 చిత్రాల్లో నడించిన ఆమె ఆమె సొంతూరు గుంటూరు జిల్లాలోని దుగ్గిరాలే కావడంతోపాటు తెనాలితో ఎంతో అనుబంధం ఉంది. తెనాలిలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చేవారు. 2009తో తెనాలిలో నిర్వహిచిన ఇంటర్నేటనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. అప్పటి ఎమ్మెల్యే, శాసనసభ ఉపసభాపతి నాదెండ్ల మనోహర్ సారధ్యంలో నిర్వహించిన ఫిల్మ్ ఫెష్టివల్‌లో పట్టణానికి చెందిన ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని రచించిన మౌలానా అబుల్ కలాంఅజాద్

▶ 2లో

తొలగింపును ప్రశ్నించిన దళితునిపై దాడి

- బాధితుని ఫిర్యాదును పట్టించుకోని పోలీసులు
- మరోసారి దాడి - ఆస్పత్రి పాలైన యువకుడు
- పెత్తందార్ల అరెస్టుకు కెవిపిఎస్, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ



బాధితుడు ఎర్రకోటయ్యను పరామర్శిస్తున్న నాయకులు

బొల్లాపల్లి మండలం పేరూరిపాడుకు చెందిన దళిత యువకుడు ధూపాటి ఎర్రకోటయ్యపై దాడి చేసిన పెత్తందారీ సామాజిక తరగతికి చెందిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, బాధితునిపై పెట్టిన కౌంటర్ కేసును రద్దు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. వినుకొండలోని ఒ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుణ్ణి ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం పరామర్శించారు. రవిబాబు మాట్లాడుతూ బాధితుడు ఎర్రకోటయ్య గతంలో విఒఎగా పని చేస్తుండగా ప్రభుత్వం మారడంతో అతన్ని తొలగించారని, దీన్ని ప్రశ్నించినందుకు అధికార పార్టీ వారు గతంలోనే దాడి చేశారని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోపోవడంతో మళ్లీ దాడికి పాల్పడ్డారని విమర్శించారు. పైగా బాధితునిపైనా కౌంటర్ కేసు నమోదు దుర్మార్గమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన

▶ 2లో

పెళ్లింట విషాదం

- వివాహానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- ఇద్దరు చిన్నారులు మృతి
- పెళ్లికొడుకు సహా 8 మందికి తీవ్ర గాయాలు





ప్రమాదంలో మృతి చెందిన చిన్నారులు

వార్త మెయిన్‌లో



అంతిమ యాత్రలో సరస్వతి భౌతికాయాన్ని మోస్తున్న ఐద్వా నాయకులు డి రమాదేవి తదితరులు

అశ్రునయనాలతో సరస్వతికి అంతిమ వీడ్కోలు

- పాడె మోసిన రమాదేవి, మహిళా సంఘం నాయకులు
- తరలివచ్చిన సిపిఎం నాయకులు, ప్రజలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ బృందం

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

1.5 మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషకాలు సీజ్

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజలెన్స్ ఏవో వాసంతి, ఎసి ప్రసాద్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ పోలురాజు, కానిస్టేబుల్స్ బాబు, భాగ్యరాజు బృందం పట్టణంలోని మారీసుపేట జయలక్ష్మి ఫర్టిలైజర్స్, నందివెలుగు రైతన్న అగ్రిటెక్ షాపులో తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నందివెలుగు రైతన్న ఆగ్రిటెక్ షాపుకు సంబంధించి అనుమతికి దరఖాస్తు చేసినా అనుమతి రాక

▶ 2లో



సొసైటీ నూతన భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండల కేంద్రంలో రూ.40 లక్షలతో నిర్మించిన పొట్ల పాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని శుక్ర వారం తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ప్రారంభించారు. మేడికొండూరులో రూ.40 లక్షలతో రైతులకు ఉపయోగపడేలా ఈ సహకార సంఘ భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆమె అన్నారు. మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, సహ కార పరపతి సంఘం చైర్మన్ దామరచర్ల కిరణ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మేడికొండూరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేయాలని చెప్పారు. ఎంపిపి మన్నవ స్వప్న, ఎంపీడీవో ఎం శోభారాణి, తహశీల్దార్ జి.కరుణ కుమార్, వైస్ ఎంపిపి రాజశేఖర్ రెడ్డి, మండలంలోని పలు శాఖల ప్రభుత్వ అధికారులు , మా పంచాయతీ సర్పంచులు , రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఐదు శాతం భూమి కేటాయింపు రద్దుపై హర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా లే అవుట్లు అభివృద్ధి చేస్తే అందులో ఐదు శాతం పేదలకు కేటాయించాలన్న ప్రభుత్వం నిబంధనలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇటీవల జీవోనెంబరు 13 జారీ చేయడంపై రియల్టర్లకు ఊరట కల్పించిందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చొరవతో ఈ నిర్ణయం వెలువడిందని కౌన్సిల్ అధ్య క్షులు బత్తుల సురేష్‌బాబు, కార్యదర్శి టి.యోగయ్య తెలిపారు. కౌన్సిల్ గుంటూరు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిబంధనల వల్ల రియల్టర్లు పడుతున్న ఇబ్బందులను రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులు సిఎంజగన్‌కు తీసుకువెళ్లడం వల్ల ఆయన సానుకూలంగా స్పందించి 5 శాతం భూమిని పేదల కోసం ప్రభుత్వానికి అప్పగించాలన్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ జీవో ఇచ్చారని తెలిపారు. ఈ అంశంపై తమ కౌన్సిల్ జీవో 145 రద్దుకు ఎన్నో సార్లు సిఎం దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈ అంశంపై మంత్రి ఆదిమూలపు సురేష్,మునిసిపల్ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి వై.లక్ష్మీ, డైరక్టర్ టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్ విద్యుల్లతకు పలు మార్లు విన్నవించామని తెలిపారు. సిఎం జగన్ తమ గోడు విని జివో రద్దు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు. అలాగే వివిధ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 800 టిడిపి బాండ్లకు సంబంధించిన ఫైళ్లను కూడా ప్రభుత్వం విడుదల చేయాలని వారు కోరారు.

తారల్లోకి వెండితెర సత్యభామ

(మొదటి పేజీ తరువాయి)

సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఆమె మృతిపై హకీంజాని తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నా పక్కనే కూర్చుంది..

జమున మరణ వార్త విని తన గుండె తరుక్కుపోతోందని దుగ్గిరాలకు చెందిన జమున చిన్ననాటి స్నేహితురాలు జంపాల సుమకుమారి కన్నీటి పర్యమంత మయ్యారు. జమున నిపోయిందని తెలిసి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. తాము చిన్నప్పటి నుండి కలిసి మెలిసి ఉన్నామన్నారు. కర్ణాటకలోని హంపిలో జమున పుట్టారని, వాళ్ల కుటుబసభ్యులతో వ్యాపార రీత్యా దుగ్గిరాల వచ్చారని, స్థానిక రథం బజారులో నివాసం ఉండేవారని తెలిపారు. దాదాపు 78 ఏళ్ల కిందట తాను నాలుగో తరగతి చదువుతుండగా జమన నాన్న ఆమెను తమ పాఠశాలలో చేర్చిచారని, క్లాసులోకి వచ్చిన జమున అటు ఇటు చూసి తన పక్కన కూర్చుందని, అప్పటి నుండి సినిమాల్లో చేరేవరకు ప్రతిరోజు ఏదో ఒక సమయంలో తప్పక కలుసుకునే వారమని చెప్పారు. ఎలిమెంటరీ పాఠశాలలో చదువు పూర్తి చేసిన



అనంతరం బాలికల హైస్కూల్లో ఇద్దరం కలిసి చదువుకునామ అని అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అట్లతద్ది రోజున ఉయ్యాల నుండి తొక్కుడు బిళ్లలు పాతకాలం నాటి ఆటలు ఆడుకునే వారమన్నారు. సినిమాల్లో చేరిన తర్వాత కూడా తనతో పాటు తీసుకెళ్లి తన చెల్లెలని అందరికీ పరిచయం చేసిందని గుర్తు చేసుకున్నారు. జమునకు అరిసెలు, అటుకులు, పండు మిరపకాయ చెట్ని చాలా ఇష్టమన్నారు. దుగ్గిరాల వచ్చినప్పుడు పులిహోర చేయించుకుని తినేదని చెప్పారు. వాళ్ల ఇంటికెళ్తే తాము భోజనం చేస్తుంటే ఆమె భర్త వడ్డించే వారన్నారు. రాజకీయాల వల్ల కొంతకాలం దూరంగా ఉన్నా తర్వాత వాటిని విడిచిపెట్టి కలిసిపోయామని తెలిపారు.

జమునకు చిన్నప్పటి నుండి సంగీతం, నాటకాలు అంటే చాలా ఇష్టమని, హైస్కూల్లో చదువుతుండగా అప్పుడే పక్క గ్రామానికి చెందిన కొంగర జగ్గయ్యతో పరిచయం ఏర్పడిందని, తెనాలి సమీపంలో వేసిన ఒక నాటకంలో వీరితోపాటు గుమ్మడి కూడా పాల్గొన్నారని చెప్పారు. 'మాభూమి' నాటకం ద్వారా ఆమెకు మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయాన్నరు. 1952లో పుట్టిల్లు సినిమాలో హీరోయిన్ పాత్ర పోషించిందని, సావిత్రి శారదలను కూడా తమ ఇంటికి దుగ్గిరాల తీసుకొచ్చిందని చెప్పారు. శ్రీకృష్ణ తులాభారంలో ఆమె వేసిన సత్యభామ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.

జమునకు తాను వారం కిందటే ఫోన్ చేశానని, 'చాలా బాగున్నాను. మోకాళ్ల నొప్పి తగ్గింది' చెప్పారని తెలిపారు. ఇంతలోనే ఇలాగైందని ఆవేదనకు గురవుతూ అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్నేహితురాలి కడచూపు కోసం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.



తెనాలిలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న జమున



దుగ్గిరాలలోని స్నేహితురాలి ఇంట్లో శారదతో కలిసి వచ్చిన జమున



దుగ్గిరాలలో స్నేహితురాలి కుటుంబ సభ్యులతో

మంగళగిరిలో ఎమ్మెల్యేగా ఓటమి

ప్రజాశక్తి-మంగళగిరి

సినీనటి జమున 1985 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళగిరి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. వామపక్షాలు బలపరిచిన టిడిపి అభ్యర్థిగా ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు పోటీలో ఉన్నారు. ఆయనపై జమున నాలుగువేల ఓట్లు మెజార్టీతో ఓడిపోయారు.

తొలగింపును ప్రశ్నించిన దళితునిపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత బొల్లాపల్లి మండలంలో దళిత, గిరిజనులపై దాడులు దౌర్జన్యాలు పెరిగాయని, రక్షణ కోసం పోలీసులను ఆశ్రయిస్తుంటే వారూ రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తుండడం అన్యాయమని అన్నారు. బొల్లాపల్లి మండలాన్ని అట్రాసిటీ జోన్‌గా ప్రకటించాలని, దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని సంఘాలనూ ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. బాధితుణ్ణి పరామర్శించిన వారిలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, కెవిపిఎస్ నాయకులు బి.కరుణ, జి.బుజ్జిబాబు, ఐద్వా నాయకులు ఎం.తిరుమలలక్ష్మి, షేక్ నాసర్‌బీ ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ముందే సరుకు నిల్వ ఉంచడం గుర్తించి దాని విక్రయాన్ని నిలువరించారు. జయలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో షాపులోని ఎరువుల నిల్వకు, రికార్డులకు వ్యత్యాసాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు. మొత్తంగా అధికారుల తనిఖీల్లో 1.5 మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషకాలను సీజ్ చేశారు. దాదాపు రూ.1,07,700 విలువైన 2.735 మెట్రిక్ టన్నులు ఎరువులు, రూ.3 లక్షల విలువైన 160 లీటర్ల పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల ఉత్తర్వులిచ్చి, కేసులు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ తెలిపారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి

ప్రజాశక్తి - వినుకొండ

జగనన్న కాలనీల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో శుక్రవారం నిర్వ హించిన ప్రచారంలో నాయకులు మాట్లాడుతూ ఐదు లక్షల రూపాయలతో పాటు ఇసుక, సిమెంటు, ఇనుము, ఉచితంగా ఇవ్వాలని కోరారు.. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు ప్రజల నుండి సంతకాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ఎల్‌సికె సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖలో పని చేస్తున్న లైన్‌మన్ దేవుళ్ళ వెంకట్రావు (40) మృతి చెందాడు. సాగర్ రింగ్ రోడ్ సెంటర్‌లో నివాసముండే వెంకట్రావు, కొప్పునూరు లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున కొప్పునూరుకు వెళుతుండగా సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తుతెలియని



దేవుళ్ళ వెంకట్రావు

వాహనం ఢీకొన డంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. రెండు కాళ్లు విరిగిపోయాయి కింద పడిపోయి ఉన్న అతన్ని స్థానికులు చూసి 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వెంకటరావు మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకట్రావుకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్య వేరుపడి కుమార్తెతో సహా వేరే ఉంటున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టి..

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని ములకలూరుకు చెందిన బొప్పుడి సుబ్బారావు ద్విచక్రవాహనం వస్తుండగా ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టిన ఘటనలో మృతి చెందాడు. శుక్రవారం పొలానికి వెళ్లి



బొప్పుడి సుబ్బారావు

ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా ములకలూరు మలుపు వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టింది. సుబ్బారావు మృతి చెందగా, మరొకరికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. సుబ్బారావు వయసు 53 ఏళ్లు అని సమాచారం.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ..

ఒకరికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి-మేడికొండూరు

రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని, వెనుకగా వస్తున్న మరో టూవీలర్ బలంగా ఢీ కొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమా దం మండల కేంద్రమైన మేడికొండూరులోని ఇందిరానగర్ కాలనీ చర్చి సమీపంలో శుక్రవారం జరిగింది. గుంటూరు ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెం దిన వి.అంజి ద్విచక్ర వాహనంపై వెళుతూ మార్గమధ్యంలో మేడికొండూరు సమీపంలో ముందుగా వెళుతున్న వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. అం జికి తీవ్రగాయా లయ్యాయి. స్థానికులు 108 కు సమా చారమివ్వడంతో అంజిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేడి కొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సోడాబండి టైరు పగిలి చేతికి గాయాలు

ప్రజాశక్తి-ఈపూరు

టైర్ పగిలి యువకుడి చేతికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన ఈపూరు లో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉప్పలపాటి మహేష్ సోడా బండి టైరుకు గాలి పెట్టే క్రమంలో ఈ ఘటన జరిగింది. టైరులో గాలి తీవ్రత ఎక్కువై ఒక్కసారిగా పెద్ద శబ్దంతో టైరు పేలడంతో అతని చేతికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు అతన్ని తీసుకెళ్లారు.

బ్రాంచ్ కెనాల్ లో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు నాగార్జునసాగర్ కెనాల్ బ్రాం చ్‌లో శుక్రవారం గుర్తుతెలి యని మృతదేహం లభ్యమైంది. మృత దేహం ఉన్న ప్రాంతానికి మేడి కొం డూరు పోలీసులు వెళ్లారు. రుద్ర చారిటబుల్ ట్రస్ట్ సహ కారంతో ఆ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. నల్లటి టీ షర్టు, ఫుల్ డ్రాయర్ తో మృతుడి కాళ్లపై రక్తపు గాయాలు ఉన్నాయి. మృతదేహం సమాచారం తెలిసినవారు మేడి కొండూరు పోలీస్‌స్టేషన్ లో సంప్రదించాలని ఎస్సై కోటేశ్వర రావు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యాపారిపై వైసిపి నేత దౌర్జన్యం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

వ్యాపారిపై వైసిపి నాయకుడు పారా కౌశిక్ దాడి చేసిన ఘటన శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లో జరిగింది. పట్టాభిపురం పోలీసుల క థనం ప్రకారం గార్డెన్స్ ఐదో లైనులో నివశిస్తున్న కొత్తమాసు వెంకట సుబ్బారావుపైకౌశిక్ అతని స్నేహితుడు నాగేశ్వరరావు దాడి చేశారు. సుబ్బారావుకు, కౌశిక్ మధ్య ఉన్న ఆర్థిక వివాదాల నేపథ్యంలో ఈ దాడి జరిగిందని సుబ్బారావు భార్య ప్రసన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సుబ్బారావు పట్నం బజారులో పురుగుమందుల వ్యాపారం చేస్తున్నాడని,కౌశిక్ గత కొంతకాలంగా వివాదం ఉందని ఈనేపథ్యంలో ఈనెల 25న ఒక సారి కొట్టారని, మరో సారి శుక్రవారం తన భార్య ఎదుట కొట్టి గాయపర్చారని ఆమె తెలిపారు. పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పౌరాణిక నాటకాలను ఆదరించాలి

ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - రొంపిచర్ల

పౌరాణిక నాటకాలను ప్రజలు ఆదరించాలని నరసరావుపేట శాసన సభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడు కలలో భాగంగా స్థానిక బోసుబొమ్మ సెంటర్ లో గురువారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అంతరించి పోతున్న నేటి తరంలో పౌరాణిక నాటకమైన సత్య హరిశ్చంద్ర నాటకమును ప్రదర్శించటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ పౌరాణిక కళాకారులు డి.వి. నరసరాజు,చీమకుర్తి నాగేశ్వరరావు వంటివారు సత్యహరిశ్చంద్ర పాత్రలను పోషించి వన్నె తెచ్చారు. వారు పోషించిన ఆ పాత్రల ద్వారా ప్రజల హదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ నాటకమును ప్రదర్శించిన కళాకారులను ఆయన అభినందించారు. అనంతరం సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో ఈ నాటకమును చూడటం జరిగింది. ఈ సందర్భంగా డా. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు చపారపు గోపాలరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పచ్చవ రవీంద్ర, మేడికొండ శ్రీనివాసరెడ్డి, పోతుమంచి రాధాకృష్ణం రాజు, శ్రీనివాస రాజు, కళాకారులు, నాయకులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





అగ్ని ప్రమాదంలో ఫ్యాన్సీ స్టోర్ దగ్ధం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని సిరిపురంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. ఫ్యాన్సీ స్టోర్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన షేక్ నూర్ బాషా ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం రాత్రి షాప్ మూసేసి వెళ్ళాడు. శుక్రవారం తెల్లవారుజామున షాపులో నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగ వెలువడి, మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి మంటలు ఆపే ప్రయత్నం చేశారు. అప్పటికే ఫ్యాన్సీ షాపులో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు మూడు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని షేక్ నూర్ బాషా తెలిపా రు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. మేడి కొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ అబ్దుల్ రెహమాన్

హెల్మెట్ ధరించని వారికి ప్రత్యేక అవగాహన

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు-చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారు లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది వాహనదారులకు అవగాహన కల్పించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,01,786
మిర్చి ఎగుమతి	: 99,132
మిర్చి నిల్వ	: 67,812

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 23,000
నెం.5	9,000- 22,000
273	13,500 - 20,500
341	9,000 - 20,500
4884	9,000 - 17,000
సూపర్ 10	23,000 - 23,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 21,000
బడిగి	9,000 - 26,000
దేవనూరు డీలక్స్	9,500- 21,000
తాలుకాయలు	4,000 - 13,000

వ్యవసాయ యంత్ర పరికరాలకు 40 శాతం రాయితీ

సమీక్ష సమావేశంలో పల్నాడు జెసి ఎ.శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రైతులకు ప్రభుత్వ యంత్ర పరికరాల కొనుగోలుకు 40 శాతం రాయితీ విడుదల చేయనుందని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. పల్నాడు జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ సరఫరా చేయు వ్యవసాయ పరికరాల ధరలపై జెసి శుక్రవారం సమీక్ష సమా వేశం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్ నందు జరిగింది. సమావేశంలో వ్యవసాయ పరికరాల ఉత్పత్తిదారులు, డీలర్లతో రైతులకు అవసరమైన యం త్రాల కొనుగోలు విషయంపై ధరలను ఖరారు చేసేందుకు సమావేశంలో



చర్చించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఈ సమావేశానికి 28 మంది డీలర్లు హాజరయ్యారు. వ్యవసాయ పరికరాలు ఉత్పత్తి అయ్యే కంపెనీల ధరలకు, బయట మార్కెట్లో రైతులకు లభించే యంత్ర పరికరాల ధరల వ్యత్యాసాన్ని పరిశీలన చేసి చూశారు. రైతు భరోసా కేంద్రాలలోని కస్టమ్ హైరింగ్ సెంటర్స్ ద్వారా రైతు గ్రూపులకు వీటిని అందించేందుకు, తగిన సహకారం అందించాలని జెసి సూచించారు. వ్యవ సాయ పరికరాలు అవసరమైన రైతులు ముందుగానే 50 నగదును బ్యాంకులో జమ చేయడం ద్వారా, మిగతా 50 శాతం రైతులకు బ్యాంకులు రుణంగా అందించ నున్నాయన్నారు. రైతులకు యంత్ర పరికరాలు కొనుగోలు చేసిన వెంటనే ప్రభుత్వం నుండి సబ్సిడీ 40శాతం వారి బ్యాంకు ఖాతాలో జమ చేయబడు తుందన్నారు. వ్యవసాయ పరికరాల ఉత్పత్తి కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వ్యవసాయ శాఖకు కొటేషన్లు ధరలను నిర్ణయించి పం పారని, వాటికి బహిరంగ మార్కెట్లో ఉన్న ధరకు ఉన్న వ్యత్యాసం గమనించి, ప్రభుత్వం నుంచి వెంటనే రైతుల ఖాతాల్లో యంత్ర పరికరాలు కొనుగోలు నగదు సబ్సిడీ జమవుతున్నందున, రైతులంతా యంత్ర పరికరాలు కొనుగోలుకు ఆసక్తి చెబుతున్నారని వివరించారు. రైతు భరోసా కేంద్రాల సహకారంతో వ్యవసాయ సాగు చేసుకునేందుకు యంత్ర పరికరాలు రైతులందరికీ ఉపయోగ పడేలా, కస్టమ్ హైరింగ్ సెంటర్స్ ద్వారా అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళి, వ్యవసాయ యంత్ర పరికరాల కంపినీ ప్రతినిధులు, డీలర్లు, ఏడీఏలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

నేడు నరసరావుపేట, గుటూరుకు సమరయాత్ర

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం హిందూపురం నుండి ఇచ్చాపురం వరకు నిర్వహిస్తున్న 'సమరయాత్ర' శనివారం మధ్యాహ్నం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చేరుకుంటుందని డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు శుక్రవారం తెలిపారు. యాత్ర నరసరావుపేటకు చేరిన సందర్భంగా స్థానిక ఏంజెల్ టాకీస్ వద్ద గల ధర్నాచౌక్ వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సభకు విద్యార్థి, యువజనులు భారీగా హాజరవ్వాలని కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను డివైఎఫ్ఐ కార్యాలయంలో నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్‌ను స్థానిక మార్నింగ్ స్టార్ కళాశాలలో ఆవిష్కరించారు. సమరయాత్ర శనివారం సాయంత్రం గుంటూరుకు చేరుతుందని నాయకులు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన నిధులు, అమలు చేయాల్సిన హామీల అమలు కోసం విద్యార్థి, యువకులు ఉద్యమించాలని, గుంటూరులో నిర్వహించే సభలో అందరూ పాల్గొనాలని కోరారు. నాయకులు పవన్‌కుమార్, హృదయ రాజు, ప్రసన్న కుమార్, జోసఫ్, వెంకీ పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల యాజమాన్యం

బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు నిర్మల విద్యార్థులు

ప్రజాశక్తి - వినుకొండ

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వినుకొండ నిర్మల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తమ ప్రదర్శన ద్వారా లక్ష్మీభవాని, శివసాయి, దీపిక, హవిలా వైష్ణవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ యాజమాన్యం సిస్టర్ సుపీరియర్ కాస్పర్ తెలిపారు. వీరితోపాటు కోచ్ శ్రీనివాస్ నాయక్‌కు అభినందనలు తెలిపారు.

నిర్మాణాల కూల్చివేత.. రోడ్ల చదును..

- 30న సిఎం రాకకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు
- ఘాట్‌రోడ్డు వద్ద ఎమ్మెల్యే స్థలంలో సభ నిర్వహణకు నిర్ణయం



రోడ్ల వెంట నిర్మాణాలను కూల్చివేస్తూ, చదును చేస్తున్న యంత్రాలు



ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ కేంద్రమైన వినుకొండకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 30వ తేదీన రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. వినుకొండను మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ తలసిల రఘురాం, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు, కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి గురువారమే సందర్శించి వెల్లటూరు రోడ్డులోని ఘాట్ రోడ్డు వద్ద గల ఎమ్మెల్యే బ్రహ్మానాయుడుకు చెందిన 8 ఎకరాల స్థలంలో సిఎం సభ నిర్వహించాలని, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో వినుకొండ మున్సిపల్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, పోలీస్ తదితర శాఖలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నాయి. హెలిప్యాడ్ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ముందు భాగంలో ఉన్న చిరు వ్యాపారులను ఖాళీ చేయించి, వారి నిర్మాణాలను తొలగించారు. శివయ్య స్తూపం సెంటర్ నుండి నరసరావుపేట రోడ్డులో ఆక్రమ ణలు తొలగింపు చేపట్టారు. వెల్లటూరు రోడ్డులో మార్గానికి ఇరువైపులా నిర్మాణా లను తొలగించి చదును చేస్తున్నారు. సిఎం సభ ప్రాంగ ణం వద్ద బ్యారీ కేడింగ్‌లు పెడుతున్నారు. గుడ్‌షెపర్డ్ పాఠశాల వద్ద దీర్ఘకాలికంగా గుంతలమయంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రోడ్లపై ఉన్న గుంతలను పూడుస్తున్నారు. రోడ్డుకిరు వైపులా ఉన్న చెట్లను తొలగించి రోడ్లు చదును చేయడంతో పాటు, జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ స్థలాలను కేటాయించి శుభ్రం చేస్తున్నారు.

ప్రజాస్వామ్య హక్కులపై జీవో 1 దాడి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రభుత్వం తెచ్చిన జీవో 1 ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అన్నారు. స్థానిక పండరిపురంలోని ఏలూరు సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వివిధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదార్లపై నిరసనను తెలిపే హక్కునూ ఈ జీవో హరిస్తుందని చెప్పారు. 1857 సిపాయిల తిరుగుబాటును దృష్టిలో పెట్టుకుని స్వాతంత్ర్యోద్యమాలను అణచడానికి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఈ చట్టాన్ని 1861లో తెచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే పోలీస్ చట్టాలైన 29, 30, 144 అమలులో ఉండగా కొత్తగా జీవోను తేవాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు నిర్ణయించిన స్థలాల్లో సభలు, సమావేశాల నిర్వహణ సాధ్యమవదని చెప్పారు. సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు పోలీస్ యాక్ట్ 30 ప్రకారం ఇప్పటికే అనుమతులు పొందుతున్నారని, అవసరమైనప్పుడు 144 సెక్షన్ విధిస్తున్నారని, అయినా మరో కొత్త జీవోను ప్రభుత్వం తేవడం ప్రతిపక్షాలను అడ్డుకోవడానికేనని చెప్పారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, బాబురావు, జె.బాబు, ఇ.మోజేస్, ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, పి.శివగణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

జీవో 1పై నేడు సదస్సు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'జీవో 1 - ప్రజాస్వామ హక్కులపై నిర్బంధం' అంశంపై స్థానిక కోటప్పకొండ రోడ్డులోని కేంద్రం ఆవరణలో శనివారం నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఐలు రాష్ట్ర అధ్యక్షులు, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ హాజరవుతారని, పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బి.సలీం అధ్యక్షత వహిస్తారని తెలిపారు.



పాదయాత్రలో నడుస్తున్న వైవి ఆంజనేయులు

యువగళం పాదయాత్రలో సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 'యువగళం' కుప్పంలో ప్రారంభం కాగా ఆయనతోపాటు కలిసి సత్తనపల్లి మాజీ ఎమ్మెల్యే పాదయాత్రలో నడిచి సంఘీభావం తెలిపారు. ఇచ్ఛాపురం వరకు 400 రోజులపాటు 4 వేల కిలోమీటర్లు సాగనున్న సుదీర్ఘంగా సాగే పాదయాత్రను జయప్రదం చేయాలని సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి శ్రేణులకు వైవి ఆంజనేయులు పిలుపునిచ్చారు.

ప్రజానాయకుడు డాక్టర్ చతుర్వేద సీతారామశాస్త్రి

ప్రజాశక్తి - సత్తెనపల్లి

విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళి

నిజమైన ప్రజానాయకుడు డాక్టర్ చతుర్వేద సీతారామశాస్త్రి అని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య అన్నారు. సత్తెనపల్లి మాజీ సర్పంచ్ చతుర్వేద సీతారామశాస్త్రి వర్ధంతి సందర్భంగా స్థానిక తాలూకా సెంటర్లోని ఆయన విగ్రహానికి ప్రముఖులు, రాజకీయ పార్టీలవారు, కుటుంబీకులు వేర్వేరుగా శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ సీతారామశాస్త్రి మొదట వామపక్షవాదిగా ఉండి తెలంగాణ సాయుధ పోరాటం కాలంలో అచ్చంపేట పోలీస్ స్టేషన్లో తుపాకులు సేకరించి రహస్యంగా దాచి ఉంచి తెలంగాణ పోరాట యోధులకు సరఫరా చేసే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించారని గుర్తు చేశారు. రహస్య జీవితాన్ని గడిపారని చెప్పారు. 1940-50 మధ్యకాలంలో కలరా ప్రబలినప్పుడు 88 తాళ్లూరు, ఉయ్యందన గ్రామాల్లో అనేక మందికి డాక్టర్ చతుర్వేద సీతారామశాస్త్రి వైద్యం చేసి ప్రాణాలు కాపాడారని తెలిపారు. వడ్డవల్లి శాస్త్రి నగర్ ఆయన పేరుతోనే ఏర్పడినదేనని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు డి.విమల, పి.మహేష్, వివిధ పార్టీలు సంఘాల నాయకులు ఆర్.పురుషోత్తం, ఎం.జగన్నాథరావు, ఎ.వీరబ్రహ్మం, ప్రభాకర్, జి.సుసులోవ్, జి.బాలకృష్ణ, జి.రజని, ఎన్.వేణుగోపాల్, పెద్ద కరిముల్లా, చాన్‌బాష, బి.నరసింహారావు, ప్రసాద్ నాయక్, పి.వెంకట కోటయ్య, ఆర్.శివనాగేశ్వరరావు, మణిబాబు, కె.శ్రీనివాస్, జె.పాల్‌రాజ్, ఎన్.తాండవకృష్ణ, ఎ.హనుమంతరావు, కె.ఆనంద్, పి.ప్రకాష్, పి.రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చతుర్వేద సీతారామయ్య శాస్త్రి కుటుంబీకులు అల్పాహారం ఏర్పాటు చేయగా సిపిఐ ఆధ్వర్యంలో ఎన్.తాండవకృష్ణ ఆర్థిక సహకారంతో వృద్ధులకు అన్నదానం చేశారు. మాతృశ్రీ వల్లమాంబ వృద్ధాశ్రమలో వృద్ధులకు అన్నదానం చేశారు. జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, ఆశ్రమ నిర్వాహకులు ఏడుకొండలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గద్దె చలమయ్య



థామస్ ఆల్వా ఎడిసన్‌కు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు : థామస్ ఆల్వా ఎడిషన్ కరెంటు బల్బ్ కనుగొన్న రోజును పురస్కరించుకొని శుక్రవారం స్థానిక కొరిటపాడులోని వాటర్ ట్యాంక్స్ వద్ద, ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ మేస్త్రీ బాణాల కొండయ్య జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి బోసు, నాయకులు రాము, శివయ్య, సిఐటియు నగర అధ్యక్షులు బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు

పరిశీలించిన నగర అదనపు కమిషనర్ రోజా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేశామని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శుక్రవారం కమిషనర్ ఆదేశాల మేరకు జిఎంసి ప్రధాన కార్యాలయంలోని 207వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ సెంటర్‌ను అదనపు కమిషనర్ పెద్ది.రోజా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజలకు ఆధార్ సేవల కోసం 9 వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ సెంటర్లు పనిచేస్తాయన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, ఈ.కె.వై.సి, ఆధార్ అప్‌డేషన్, ఫోన్ నంబర్ అనుసంధానం, చిరునామా మార్పు వంటి సేవలను నిర్దేశిత రుసుంతో అందించడం జరుగుతుందన్నారు. నగరంలోని కొత్తపేట కుగ్లర్ హాస్పిటల్ రోడ్డులోని 32వ వార్డు సచివాలయంలో, లాంచెస్టర్ రోడ్డులోని 46, లాల్‌పురం రోడ్డులోని 74, ఎన్.జి.ఓ.కాలనీలోని 95, కోబాల్ట్‌పేటలోని 123, అరండల్ పేటలోని 143, పెద్దపలకలూరులోని 172, బుడంపాడులోని 196, రెడ్డిపాలెంలోని 204వ వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్





నివాళులర్పిస్తున్న సిహెచ్ బాబురావు, పాశం రామారావు, వి కృష్ణయ్య,జొన్నా శివశంకర్ తదితరులు

అశ్రునయనాలతో సరస్వతికి అంతిమ వీడ్కోలు

పాడె మోసిన రమాదేవి, మహిళా సంఘం నాయకులు

తరలివచ్చిన సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి-తాడేపల్లి

కేన్సర్ వ్యాధితో గత కొంతకాలంగా పోరాడుతూ విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం రాత్రి సిపిఎం పట్టణ నాయకురాలు, అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) తాడేపల్లి పట్టణాధ్యక్షురాలు బూరుగ సరస్వతి(52) కన్నుమూశారు. గురువారం రాత్రి తాడేపల్లి ప్రకాష్ నగర్‌లోని ఆమె స్వగృహానికి తరలించారు.

సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు, తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు సతీమణి బూరుగ సరస్వతి అంతిమయాత్ర వందలాది మంది అశ్రు నయనాల మధ్య శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఉదయం నుండి అంతిమయాత్ర ప్రారంభమయ్యే మధ్యాహ్నం మూడు గంటల వరకు సిపిఎం రాష్ట్ర, జిల్లా, స్థానిక నాయకులతో పాటు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.ప్రకాష్‌నగర్‌లోని ఆమె స్వగృహం నుండి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. దారిపొడవునా 'జోహార్ బూరుగ సరస్వతి' అంటూ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నినదించారు. సరస్వతి మృతదేహంపై అరుణ పతాకాన్ని కప్పి సిపిఎం నాయకులు నివాళులర్పించారు. తమతో పాటు పనిచేసిన తమ సహచర ఉద్యమకారిణి సరస్వతి పాడెను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి, జిల్లా స్థాయి నాయకులు భీమిరెడ్డి కోటేశ్వరి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కె.ఉషారాణి, పి.గిరిజ మోస్తూ ఘన నివాళులర్పించారు.

నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర నాయకులు, వి.కృష్ణయ్య, దడాల సుబ్బారావు, కె.ధనలక్ష్మి, ఎ.ఉమామహేశ్వరరావు, పి.మురళీకృష్ణ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, ఎస్ఎస్ చెంగయ్య, ఎం.రవి, ఈమని అప్పారావు, కె నళినికాంత్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్తి, కౌలు రైతు సంఘం నాయకులు బైరగాని శ్రీనివాసరావు, రాజధాని సిపిఎం నాయకులు ఎస్.పీర్‌సాహెబ్, వి.వెంకటేశ్వరరావు, ఈ.రామారావు, పి.గాంధీ, ఎం.భాగ్యరాజ్, పి.బత్తిరెడ్డి, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, ప్రజాశక్తి జిఎం సురేష్‌రాజు, ఓలేటి శ్రీనివాసరావు, మారుతీ శ్రీనివాస్, అమలశ్రీ, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, ఎ.కృష్ణమోహన్, సిఐటియు జిల్లా నాయకులు ముత్యాలరావు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, జెవి రాఘవులు, సిపిఎం కొలనుకొండ కార్యదర్శి కె.శివన్నాయణ, సిపిఎం తాడేపల్లి నాయకులు కె.కరుణాకరరావు, వేముల దుర్గారావు, డివి భాస్కరరెడ్డి, వై.బర్నబాసు, ఎస్.ముత్యాలరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.వెంకటయ్య, కె.బాబూరావు, ఎన్. నాగేశ్వరరావు, పి.రామ చందరరావు, విక్రాంత, ఉద్యోగి వై.మల్లారెడ్డి, సి.నాగేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎన్.కిశోర్‌బాబు, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, వి.శ్రీనివాసరావు, బి. రామారావు, జి.అంజిరెడ్డి, బాపట్ల జిల్లా సిపిఎం నాయకులు టి కృష్ణమోహన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షులు వి.వెంకట్రావు, టిడిపి నాయకులు కె.రమణ, న్యూడెమోక్రసి నాయకులు కె.ఆదినారాయణ, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయకార్యదర్శి టి.కాశయ్య, టి.వెంకటయ్య, జె.ప్రవీణ్, పెద్ద ఎత్తున మున్సిపల్ కార్మికులు, పలు ప్రజాసంఘాల నాయకులు నివాళలర్పించారు.

ధన్యజీవి సరస్వతి

అంతకుముందు బూరుగ సరస్వతి సంతాప సభ సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళా సంఘం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, అందరి మన్ననలు పొందిన ధన్యజీవి సరస్వతి అని ఘనంగా నివాళులర్పించారు. చిన్న వయసులోనే కేన్సర్ మహమ్మారి ఆమెను కబళించడం దురదృష్టకరమన్నారు. సరస్వతి మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటని చెప్పారు. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ తాడేపల్లి, కృష్ణనగర్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేశారని అన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యమంలో పనిచేస్తూ,చివరి వరకూ ఎర్రజెండా కింద నిలిచిన సరస్వతిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో జరిగిన సమస్యలపై జరిగిన పోరాటాల్లో ఆమె కీలకపాత్ర పోషించారని చెప్పారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కృష్ణనగర్‌లో జరిగిన భూ పోరాటాల్లో పాల్గొని పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు దక్కేవిధంగా కృషి చేశారని అన్నారు. పంచాయతి వార్డు సభ్యులుగా పనిచేసిన, పైలెట్ ప్రాజెక్టు టీమ్‌లో సభ్యులుగా పనిచేసినా ప్రజా ప్రయోజనాల కోసమే పనిచేశారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ మాట్లాడుతూ సిపిఎంలో పనిచేస్తున్న తన భర్త వెంకటేశ్వర్లకు చేదోడువాదోడుగా ఉండటమే గాక, తాను కూడా ఉద్యమానికి అంకితమై పనిచేశారని అన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం చివరికంటూ పని చేసిన సరస్వతి అందరికీ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. మతోన్మాదం జడలు విప్పిన నేటి పరిస్థితిలో ఆమె స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్-ఎస్ చెంగయ్య, రాష్ట్ర బాలోత్సవాల కన్వీనర్ పి. మురళీకృష్ణ,రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సిపిఎం రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉద్యమంలో సరస్వతితో తమకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు, పాశం రామారావు, వై నేతాజీ, కె ధనలక్ష్మి, ఉమామహేశ్వరరావు, ఎస్ఎస్ చెంగయ్య



నివాళులర్పిస్తున్న శ్రీనివాసకుమారి తదితరులు

కెఎల్‌యులో అంతర్జాతీయ కెమెస్ట్రీ సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గ్రీన్ హౌస్ వాయువుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలని ఎపి నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కెఎల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ కెమిస్ట్రీ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రానున్న కాలంలో హైడ్రోజన్, పంకాల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తుందన్నారు. ప్రస్తుతం కాలుష్య నివారణ కోసం సహజ వాయువులతో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. అయితే రానున్న కాలంలో గ్రీన్ గ్యాస్, గ్రీన్ హైడ్రోజన్ తదితర వాయువులతో కూడా విద్యుత్ ను ఉత్పత్తి చేయడానికి కృషి జరుగుతుందన్నారు. ప్రొఫెసర్, ఛాన్సలర్ డాక్టర్ డి.కె.ఎస్. జగన్నాథరావు మాట్లాడుతూ ఇథనాల్, మిథనాల్‌తో పాటు ఆల్కహాల్ తో కూడా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి రంగం సిద్దం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వీటితో విద్యుత్ తయారి కార్మాగారాన్ని మహారాష్ట్రలో ప్రారంభించారన్నారు. మానవ మెదడులో జరిగే రసాయనక చర్యల గురించి కేవలం 20 శాతం మాత్రమే పరిశోధనలు జరిగాయన్నారు. ఇంకా 80శాతం పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. ఎం హెచ్.ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ బొగ్గుపులుసు వాయువుల విడుదల కారణంగా ఓజోన్ పొర ఇప్పటికే ప్రమాదకర పరిస్థితిలో ఉందన్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ రహిత సమాజం వైపు సహజ వనరులతో విద్యుత్ తయారీకి శ్రీకారం చుట్టడం శుభపరిణామం అని అన్నారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పరిశోధన మరియు అభివృద్ధి డీన్ డాక్టర్ జయకుమార్ సింగ్, విసి డాక్టర్ జి.పార్థసారథి వర్మ, డాక్టర్ కెఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



మెగా డెంటల్ క్యాంప్‌లో 250 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలో గల విజేపి అండ్ డి ఎల్ బి డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ యూనిట్స్, ట్రైడెంట్ డెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో మెగా డెంటల్ క్యాంప్ జరిగింది. 250 మందికి డెంటల్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడిసిన్ వాడుకునే విధానం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మాజేటి వంశీకష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ కే వెంకటేశ్వరరావు, శ్రీధర్, కళాశాల టీచింగ్ స్టాఫ్, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

సీఎంని కలిసిన గంజి చిరంజీవి

ప్రజాశక్తి - మంగళగిరి



ఇటీవల ఆప్కో చైర్మన్‌గా నియమితులైన గంజి చిరంజీవి శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఆప్కో చైర్మన్ గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సుధాకర్

ప్రజాశక్తి - మంగళగిరి



టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మంగళగిరి పట్టణానికి చెందిన రేఖ సుధాకర్ ను నియమించింది. ఈ మేరకు నియమాక పత్రాలను అందజేసినట్లుగా సుధాకర్ శుక్రవారం తెలిపారు. సుధాకర్ నియామకం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

అజాగ్రత్తతో అధిక రోడ్డు ప్రమాదాలు



ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - క్రోసూరు


ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న క్రోసూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ బి.శ్రీనివాస్‌రావును మండలంలోని రేషన్ డీలర్లు సన్మానించారు. గణ తంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా ఈ అవార్డును శ్రీనివాసరావు అందుకున్నారు. ఈ సందర్భంగా క్రోసూరులో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయనకు పూల మాలలు, దుశ్శాలువాలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శ్రీని వాస రెడ్డి, వి.అప్పారావు, కె.లక్ష్మయ్య,షేక్ రఫీ, ఎన్.కృష్ణం రాజు, పి.పుష్పసాయి, షేక్‌బాజీ, పి.కిషోర్‌బాబు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - ముప్పాళ్ల

అభినందన ఆర్ఫన్ అండ్ నీడీ సేవా సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రం ముప్పాళ్లలోని ఎస్సీ కాలనీలో 50 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వీటితో పాటు కథల పుస్తకాలు, కాఫీ రైటింగ్ బుక్స్ ,పెన్నులు, పెన్సిల్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కె. సురేం ద్రబాబు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ కాలనీలలో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదుకునేందుకు, పేదల అభ్యున్నతికి తమ సొసైటీ కృషి చేస్తోందని చెప్పారు. సభ్యులు మన్నం కోటేశ్వరరావు, పలుకూరి రామారావు, బక్కా రాజు పాల్గొన్నారు.



గణపవరం క్వారీలో 'ఇదేమి కర్మ'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గణపవరంలోని 4వ వార్డు, పరమేశ్వర క్వారీలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇంటిం టికీ వెళ్లి ప్రజా సమస్యలను గురించి అడిగి తెలుసు కోవడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుంచి రాష్ట్ర ప్రజలకు జరుగుతున్న అన్యా యాలు, నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు పెరుగుదల, నిరుద్యోగ సమస్య, రాష్ట్రం అభివృద్ధికి నోచుకోని పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారని అన్నారు.

- సత్తెనపల్లి రూరల్ సిఐ రామిశెట్టి ఉమేష్
- రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పలుచోట్ల ర్యాలీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సత్తెనపల్లి రూరల్ సిఐ రామిశెట్టి ఉమేష్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సత్తెనపల్లి మండలం కంటెపూడి నలంద ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. సిఐ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనాలు నడపటం వల్ల 90 శాతం పైగా రోడ్డు ప్రమాదాలు జరుగు తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థుల పాల్గొన్నారు.



దుర్గిలో..

ప్రజాశక్తి - దుర్గి

రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన దుర్గిలో పోలీసులు భారీ ర్యాలీ నిర్వ హించారు. దుర్గి ఎస్సై టి.వెంకటరమణ పోలీస్ సిబ్బందితో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పోలీస్ స్టేషన్ వద్ద నుంచి స్టేట్ బ్యాంకు వరకు ఈ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్లకా ర్డులు చేతబూని, మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్సై వెంకట రమణ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్

రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని కంభంపాడులో


రాజుపాలెంలో..


కంభంపాడులో..

రూరల్ ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బందితో కలిసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థు లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, కార్లు నడిపే వారు బెల్టు పెట్టుకోవాలని మద్యం తాగి వాహనాలు నడపరాదని పలు విషయాలను వివరించారు.


ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పిస్తున్న సత్తెనపల్లి రూరల్ సి ఐ ఉమేష్

ప్రజాశక్తి - క్రోసూరు

రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. వీరాస్వామి, క్రోసూరు ఎస్ఐ సిహెచ్ మణికృష్ణ, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజలు పోలీస్ సిబ్బందితో స్థానిక పోలీస స్టేషన్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి వాహన చోదకులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాల్సిన అవశ్యకతపై వివ రించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులకు ఎస్ఐ పలు సూచనలు చేశారు.



క్రోసూరులో..

ప్రజాశక్తి-రాజుపాలెం

రోడ్డు భద్రతపై నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని అప్పుడే ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉంటాయని రాజుపాలెం ఎస్ఐ మహమ్మద్ షఫీ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, పరిమితికి మించి ఆటోలలో, ద్విచక్ర వాహనంపై ప్రయాణించే కూడదని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు శిక్షలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని, వాహనానికి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా కళాజాత బృందం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామిశెట్టి ఉమేష్, స్థానిక పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సత్తెనపల్లి పట్టణ ఎస్సై ఎ.రఘుపతి విజ్ఞప్తి చేశారు. నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో వేదా కళాశాలలో యూత్ లీడర్‌షిప్ - కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పై మూడు రోజుల శిక్షణ తంగతులను ఎస్సై రఘుపతి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా రఘుపతి రావు మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు ఆకర్షితులై నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాలు పెంపొందించటం, భావం వ్యక్తీకరణ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు, డిజిటల్ లిటరసీ, స్వచ్ఛంద సేవ ద్వారా కమ్యూనిటీ డెవలప్మెంట్ చేయడం వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. ఇలాంటి అవకాశాలను యువత అందిపుచ్చుకుని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. జన చైతన్య సమితి ఫౌండర్ ప్రెసిడెంట్ దాసరి విజయ్ బెన్నిబాబు మాట్లాడుతూ శిక్షణా తరగతులు 3 రోజులు పాటు జరుగతాయని తెలిపారు., శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెటీరియల్, నెహ్రూ యువ కేంద్ర ద్వారా సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని వివరిం చారు. కార్యక్రమంలో ఇరుగింటి విజయశాంతి,ఎస్ కె మస్తాన్ వలి, జన చైతన్య సమితి కో ఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



యువకులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎస్ఐ రఘుపతి

'మా ఊళ్లో వారికేం పని'

మంత్రి అంబటి పై ఎంపిటిసి ఆగ్రహం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం పెదమక్కెన ఎంపిటిసి వేంపాటి విజయలక్ష్మి, మంత్రి అంబటి రాంబాబు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎంపిటిసి కి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ప్రధానోపాధ్యాయురాలు వనజ తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపిటిసి ఎన్నికల్లో రూ.30 లక్షలు ఖర్చుపెట్టి గెలిచాం కానీ, మండల స్థాయి నాయకులు వచ్చి పెత్తనం చేస్తున్నారని అన్నారు. కనీసం మాకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడంపై మంత్రి అంబటి రాంబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేతిరాత పోటీల్లో వినుకొండ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ: జాతీయ చేతిరాత దినోత్సవం (జనవరి 23) సందర్భంగా వేద అకాడమి అద్దంకి వారు గత డిసెంబర్ నెల నుండి జనవరి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆన్లైన్,ఆఫ్లైన్ చేతిరాత పోటీలలో వినుకొండకు చెందిన నలుగు గురు విద్యార్థులు వివిధ లెవెల్స్‌లో బహుమతులు సాధించారు. ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 2 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కిడ్స్ లెవెల్ పోటీలలో శ్రీ ఆదిత్య హై స్కూల్ కు చెందిన ఆర్. హరితేజ ప్రథమ బహుమతి సాధించి రూ.2,500 బహుమతి అందుకున్నాడు. గీతాంజలి హై స్కూల్ కు చెందిన డి. హేమాక్షి నందన్ ద్వితీయ బహుమతి సాధించి నగదు రూ.2 వేలు బహుమతి అందుకుంది. జూనియర్ లెవెల్ పోటీలలో శర్మ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు చెందిన పొట్టి సౌమ్య లత ప్రథమ బహుమతి సాధించి రూ.2500 నగదు బహుమతి అందుకుంది. సీనియర్ లెవెల్ పోటీలలో శ్రీ ఆదిత్య హై స్కూల్ కి చెందిన ఆర్. యశ్వంత్ ద్వితీయ బహుమతి సాధించి రూ.2,000 నగదు బహుమతి అందుకున్నాడు. విజేతలను ఆయా పాఠశాలల డైరెక్టర్లు వి.రవి , వై ఎల్. కిషోర్, శర్మ, చేతిరాత ట్రైనర్ సోమేపల్లి వెంకట సీతారామయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

చిత్తు కాగితాలు ఏరుకుంటున్న బాల్యం



ప్రజాశక్తి - మంగళగిరి

బడికి వెళ్లి తోటి పిల్లలతో ఆటపాటల్లో తేలియాడాల్సిన కొందరు బాలలు గణతంత్ర దినోత్సవం సాక్షిగా చెత్తకుప్పల్లో కాగితాలేరుకుంటూ చదువుకు దూరమవుతున్నారు. కొందరు పేద చిన్నారులు కుటుంబ పోషణ కోసం కార్మికులుగా మారుతూ అర్ధాకలి తో అలమటిస్తున్నారు. బడిబాట, మధ్యాహ్న భోజన పథకం, బ్రిడ్జి స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠ శాలలు ఇలా ఎన్ని ఉన్నా ఇంకా బాలలు పనుల్లో మగ్గుతూనే ఉన్నారు. 1964ఎపి సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ ప్రకారం బాలలతో ఇళ్లలో పని చేయించడంగాని, ఇతర వెట్టిచాకిరీ గానీ చేయించడం నేరం. రుణ బకాయి కింద జీతానికి పెట్టుకోవడం నేరం. 1986 బాలకార్మిక నియంత్రణ చట్టం ప్రకారం ప్రమాదకరమైన పనుల్లో పెట్టుకోకూడదు. 1986 ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం నేరం. పనిలో పెట్టుకున్న యజమానులకు 3ఏళ్ల జైలు శిక్ష, రూ. 30వేల వరకు జరిమానా విధిస్తారు. 2010 ఏప్రిల్ 1 నుంచి ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చింది. ఇలా బాలకార్మిక వ్యవ స్థను నిర్మూలించడానికి ఎన్ని చట్టాలు తెచ్చినా, పథకాలు ప్రవేశ పెట్టినా అధికారుల అలసత్వంతో అవి నీరుగారిపోతున్నాయి. నగర పరిధిలో తరచూ ఎక్కడో ఒక చోట బాలకార్మికులు కనిపిస్తున్నారు. ఉదయం మురికి కాల్వల వెంట మందుబాబులు పడేసిన సీసాలు, డిస్పోజబుల్ గ్లాసులతో పాటు చిత్తు కాగితాలు ఏరుతున్నారు. అధికారులు స్పందించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను పటిష్టంగా అమలు చేయడంతో పాటు బాలలకు నిర్బంధ విద్యను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విజయవాడ ఎంబివికెలో 30న చేతివృత్తిదారుల సదస్సు

జయప్రదం చేయాలని మంగళగిరిలో కరపత్రాలు పంపిణీలో పి.బాలకృష్ణ పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ చేతివత్తుదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్ర ఆడిటోరియంలో 30వ తేదీన ఉదయం 10 గంటలకు జరిగే సదస్సును జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ కోరారు. సదస్సు జయప్రదం కోరుతూ పాత మంగళగిరిలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతు అధికారంలోకి వస్తే బడ్జెట్లో రూ.1000 కోట్లు కేటాయిస్తానని, చేనేత కార్మికులకు పక్కా గృహాలు ఉచితంగా నిర్మిస్తానని,150 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇస్తానని 2019 ఎన్నికల సందర్భంగా ఎన్నారై హాస్పటల్ వద్ద ఒకరోజు నిరాహార దీక్షలో జగన్మోహన్ రెడ్డి వాగ్దానం చేశారని, కానీ అధికారానికి వచ్చిన తర్వాత బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా మాట మార్చారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మగ్గాలు ఉంటే 81 వేల మందికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని,మిగతా 1,19,000 మందికి వివిధ సాకులు చూపి ఈ పథకం అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేనేతకు సంవత్సరాలనికి రూ.5వేల కోట్లు కేటాయిస్తాని చెప్పిందన్నారు. కానీ 2014 అధికారానికి వచ్చిన దగ్గర నుండి 2014లో రూ.621 కోట్లు 2015 లో రూ.486 కోట్లు 2016లో రూ.710 కోట్లు 2017లో రూ.604 కోట్లు 2018లో రూ.396 కోట్లు 2019లో రూ. 456 కోట్లు 2020లో రూ. 344 కోట్లు 2021 లో రూ.475 కోట్లు 2022 లో రూ.200 కోట్లు మాత్రమే కేటాయించిదన్నారు., మొత్తం 45వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.4,292కోట్లు మాత్రమే కేటాయించారని కనీసం ఒక బడ్జెట్లో కేటాయించాల్సిన రూ.5వేల కోట్లు కూడా తొమ్మిది సంవత్సరాల్లో కేటాయించలేదని విమర్శించారు. సెలూన్ షాపులను రిలయన్స్ సంస్థకు అప్పజెప్పిన పరిస్థితి, మత్స్య కార్మికులు సముద్రంలో చేపలు పట్టుకోడానికి కార్మికులకి అనుమతులు ఇవ్వకుండా స్టీమర్లుతో చేపలు పట్టుకోడానికి అంబానీకు అనుమతులు ఇవ్వడంతో వాళ్ళు కూలీలుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు నల్లు శ్రీనివాసరావు, జోన్నదుల చంద్రమౌళి కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్లో చేతివృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేటాయింపులు పెంచాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు కోరారు.వృత్తిదారుల సమస్యలపై చేతివృత్తుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో, మాకినేని బసవపునయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో మండూరు వెంకట నర్సయ్య అధ్యక్షతన జరిగిన రజకవృత్తిదారుల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వృత్తిదారులకు కేటాయించిన నిధులను వారి అభివృద్ధి, సంక్షేమానికే ఖర్చు పెట్టాలని, సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని, రజక వత్తిదారులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమకేసులు, అత్యాచారాల నివారణకు రజకుల సామాజిక రక్షణ చట్టం చేయాలని, ప్రమాద బీమా వర్తింప చేయాలని తదితర సమస్యలపై రాష్ట్ర సదస్సు జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 56 బీసీ తరగతులకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు గొప్పగా ప్రచారం చేస్తుందని, కానీ అభివృద్ధి, సంక్షేమ కార్పోరేషన్లకు విధివిధానాలు రూపొందించకుండా, తగిన నిధులు విడుదల చేయకుండా కేవలం చైర్మన్‌లను, డైరెక్టర్లను నియమించి, గడచిన రెండేళ్ల కాలంలో వృత్తిదారుల అభివృద్ధికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. మళ్లీ కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ల కాల పరిమితిని పొడిగిస్తూ జీవో ఇస్తూ బీసీ తరగతులను మరొకసారి మోసం చేయడానికి సిద్ధమైందని విమర్శించారు. కేటాయించిన నిధులు కూడా దారి మళ్లించి వృత్తిదారులకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కమ్ ఇస్త్రీదారుల సంఘం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రజక వత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం చేతి వత్తిదారుల పట్ల అనుసరిస్తున్న విధానాలకు నిరసన తెలపాలని అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు బి.శివరామయ్య, ఎ. సాంబశివరావు, పి.రాంబాబు, ఈ.వెంకటేశ్వరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.



మంగళగిరిలో మాట్లాడుతున్న పి బాలకృష్ణ



గుంటూరులో సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

మేడికొండూరు జడ్‌పి హైస్కూల్లో
ఆర్‌జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌ను శుక్రవారం ఆర్‌జెడి వి ఎస్ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైస్కూల్లో జరుగుతున్న నాడు నేడు పనుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యత ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పట్టిన పరిశీలించి 10వ తరగతి విద్యార్థుల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్ లో జరుగుతున్న ప్రధానమంత్రి పరీక్షాపై చర్చ గోష్టి కార్యక్రమాన్ని విద్యార్థులకు ప్రదర్శించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ సుధాకర్ రెడ్డి, ఏడుకొండూరు మండల విద్యాశాఖ అధికారి జయరామిరెడ్డి, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కే జయప్రద, పలు రద్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడి

సురక్షిత గ్రామాలను నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు :బాల్య వివాహాలు, మానవ అక్రమ రావాణా, గృహ హింస లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని, వాటిని నిర్మించుకోవడానికి అందరూ కృషి చేయాలని ల్యాంప్ సంస్థ కో-ఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ అంశంపై మండల పరిధిలోని నడిపాలెం జెడ్ పాఠశాలలో విద్యార్థులకు మై చాయిస్ ఫౌండేషన్, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కె.వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ బాల్యవివా హాలు, మానవ అక్రమ రవాణా, గృహ హింసపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, తద్వారా సురక్షిత గ్రామాల నిర్మాణంలో భాగస్వాములు కావాలని చెప్పారు. హెచ్ఎం ఎం.సాల్మన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సులువని చెప్పారు. బాలల హక్కులు, వాటికి విఘాతం కలిగితే వివిధ సెక్షన్ల కింద నమోదు చేసే కేసుల గురించి గ్రామ మహిళా పోలీస్ నాగలక్ష్మి వివరించగా గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై ప్రోగ్రాం ట్రైనర్ షేక్ బాజి అవగాహన కల్పించారు. బ్యాడ్ టచ్ జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫిర్యాదు చేయాల్సిన విధానాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు సురక్షిత గ్రామ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబశివరావు, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

రోడ్డు భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : పొన్నూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ అధ్యక్షత రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు మాట్లాడారు. రోడ్డు భద్రత గురించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు తెలిపారు. కార్యక్రమంలో గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని గౌతమ బుద్ధ రోడ్డు, పోలీస్ స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై నారాయణ, మహేంద్ర పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపల్లి రాజును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

నాటక కళాకారుడు రాజుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి:స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ నటించిన బండరాముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన సాంఘిక నాటక కళాకారుడు కొత్తపల్లి రాజును సత్కరించారు. కార్యక్రమంలో జాలాది వెంకటేశ్వరరావు, కొత్తపల్లి చౌడేశ్వరరావు, శ్రీపాది రాజేష్, పి.వెంకట్రావ్, పి.శ్రీనివాసరావు, ఉరిటి శ్రీనివాసరావు, కె.సాంబశివరావు పాల్గొన్నారు. .

ఘనంగా రాజగోపురం మహాసంప్రోక్షణ

ప్రజాశక్తి-తెనాలి:స్థానిక షరాఫ్ బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో రాజగోపురం మహాసంప్రోక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పందర్భంగా ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, రఘురాం, నాగమారుతి ఆధ్వర్యంలో నూతన విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. పూజలోఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు కార్యక్రమంలో ఎస్‌బి శివ, నిఖిల్ శాండల్య, గుడివాడ బాలకృష్ణ, అవుతు శ్రీనివాసరావు, పి.త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్లో 'పిఎం పరీక్షపై చర్చ'

ప్రజాశక్తి-తాడేపల్లి



స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం పిఎం పరీక్షాపై చర్చా కార్యక్రమం నిర్వహి ంచారు. విద్యా శాఖ కమిషనరేట్ జెడి డాక్టరు చంద్రిక పాల్గొని పలు అంశాలపై విద్యార్థులతో చర్చించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి ఎస్ ఎ-1లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థ లను అభినందించారు. మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల రాయల సుబ్బారావు, ఉపాధ్యాయులు ప్రసాదు, కోటేశ్వరరావు, నాగశేషులు, స్వరూప, అపర్ణ పాల్గొన్నారు.

తోపుడుబండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి : పట్టణంలోని 15వ వార్డుకు చెందిన తాడిబోయిన వెంకటేశ్వరరావుకు శుక్రవారం టిడిపి పట్టణాధ్యక్షుడు వి.వెంకట్రావు తోపుడుబండిని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి డి.సుందరయాదవ్ మాట్లాడుతూ అందరూ సమిష్టిగా పని చేసి టిడిపి గెలుపునకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు సిహెచ్ శివుడు, ప్రధాన కార్యదర్శి దాసు, డి.రామారావు, శ్రీనివాసరెడ్డి, బి.శివమ్మ, టి.గోపి పాల్గొన్నారు.



చినజీయర్ స్వామికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి గణతంత్రదినోత్సవ సందర్భంగా చినజీయర్ స్వామికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించడాన్ని బాపూజీ విద్యాలయం చైర్మన్ వై.తులసీరామ్ అభినందనలు తెలిపారు. ఆయన తో పాటు పాఠశాల సిబ్బంది శుక్రవారం సీతానగరంలో జీయర్ స్వామిని కలిసి సత్కరించారు.



సమగ్ర శిక్ష ఏపీసీగా విజయలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు

సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా జి.విజయ లక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 1981లో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన ఆమె 2009 నుండి తహాశీల్దారుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా మద్దిపూడి తహాశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ, డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది, సమగ్ర శిక్ష ఏపీసీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ ఆఫీసు, సమగ్ర శిక్ష కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్, ఇతర జిల్లా నాయకులు ఎపిసికి పూలబొకే అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయటానికి నిధులు మంజూరు చేయాలని, ఎంఆర్‌సి సిబ్బంది పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని, ఎంఆర్‌సిలలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని యుటిఎఫ్ నాయకులు ఎపిసిని కోరారు. ఎపిసికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, జిల్లా అడిట్ కమిటీ సభ్యులు ఎం.గురుబ్రహ్మం, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



నూతన ఏపిసికి బొకే అందచేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కోలాహలంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

నేడు జూనియర్స్ రేపు సీనియర్స్ విభాగంలో పోటీలు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఒంగోలు జాతి వృషభరాజముల విశిష్టత చరిత్రలో నిలిచి ఉంటుందని నడకలో రాజసం, విశిష్టమైన శరీర దారుఢ్యం, విశ్వాసానికి ఒంగోలు జాతి పశువులు గుర్తింపు అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట సత్తెనపల్లి రోడ్డులో గల జిల్లా క్రీడా ప్రాంగణంలో ఈనెల 22 నుండి జరుగుతున్న గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి జాతీయ స్థాయి వృషభ రాజముల బల ప్రదర్శన పోటీలలో భాగంగా శుక్రవారం సబ్ జూనియర్ విభాగంలో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరిగాయి. ఈ పోటీలను నిర్వహణ కమిటీ సభ్యులు ప్రారంభించి పోటీలలో తల పడుతున్న ఎడ్ల జత యజమానులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎడ్ల బల ప్రదర్శన పోటీలకు రైతుల నుండి వస్తున్న స్పందన చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. మన రాష్ట్రంలో బీజం పడిన ఒంగోలు జాతి పశువులు సంఖ్య తగ్గిపోతుందని వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, పెరిగిన పశు పోషణ ఖర్చులతో ఒంగోలు జాతి పశువుల పెంపకం తగ్గిపోయిందన్నారు. రైతులు ఒంగోలు జాతి పశువులను ఆదరించాలని సూచించారు. పోటీలు నిర్వహణకు సహకరించిన పలువురు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అభినందించారు.



బల ప్రదర్శనలో తలపడుతున్న ఎడ్ల జత



ఎడ్ల జత యజమానులకు జ్ఞాపికలు అందజేస్తున్న కమిటీ సభ్యులు

రోడ్డు విస్తరణకు సహకరించండి

భవన యజమానులకు మేయర్ గులాబీలు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా నగరంలో రోడ్డు విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక హిందూ కాలేజి జంక్షన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ రోడ్డు విస్తరణ పనులను జిఎంసి పట్టణ ప్రణాళికాధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక భవనాల యజమానులకు గులాబీలు అందచేసి, రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే పలకలూరు రోడ్డు, ఏ.టి అగ్రహారం రోడ్డు, కొత్తపేట శివాలయం తదితర రోడ్లను విస్తరణ చేస్తున్నామన్నారు. హిందూ కాలేజి వద్ద రహదారిలో ప్రతిరోజు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, నెల్లూరు, పల్నాడు ఇలా ఎన్నో వేల వాహనాలు ప్రయాణిస్తాయన్నారు. ఇదే రహదారి నుండి జిజిహెచ్, ఇతర ఇసుపత్రలకు అంబులెన్స్‌లు వచ్చినప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. ప్లాన్ ప్రకారం 120 అడుగులకుగాను, 60 నుండి 70 అడుగులు మాత్రమే ఉందన్నారు. కావున 120 అడుగులకు విస్తరించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కావున స్థానిక ప్రజలు రోడ్డు విస్తరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నాయకులు గులాం రసూల్, డివిజన్ల కార్పొరేటర్లు సాదు ఉమామహేశ్వరి రాజేష్, పాప తోటి అంబేద్కర్, ఐశెట్టి కనకదుర్గ శ్రీనివాస్, సిటీ ప్లానర్ మూర్తి, డి.సి.పి కోటయ్య పాల్గొన్నారు.



గులాబీలు అందజేస్తున్న మేయర్, తదితరులు



నూతన కార్యవర్గం

మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్.ఫణీంద్రకుమార్, ఎస్‌కె.అబ్దుల్ సలీం ఎన్నికయ్యారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో యూనియన్ జిల్లా వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.అనిల్‌కుమార్, వి.శశిధర్, సహాయ కార్యదర్శులుగా ఎస్.మల్లిఖార్జునరావు, కె.స్వాములు, కోశాధికారిగా ఎన్.సీతారాంతోపాటు మరో 37 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తొలుత మహాసభలో జిల్లా కార్యదర్శి సలీం కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. మహాసభకు ముఖ్యవక్తగా హాజరైన రాష్ట్ర కోశాధికారి డి.ప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మెడికల్ రిప్రజెంటేటివ్‌లపై యాజమాన్యాలు చేస్తున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రెటరీ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం దుర్మార్గంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలని, మెడికల్ పనిపద్ధతులను కల్పించాలని కోరారు.

రేపు 'నాగలికి నా నమస్కారం' ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు బ్రాడిపేట 2/7లోని కొరటాల మీటింగ్ హాలులో ప్రముఖ రచయిత సోమేపల్లి వెంకట సుబ్బయ్య రచించిన 'నాగలికి నా నమస్కారం 'నానీల సంపుటి ఆవిష్కరణ జరుగుతుందని సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని ఒక ప్రకటనలో తెలియజేశారు.'సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి చిల్లర భవానీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేస్తారన్నారు.కార్యక్రమంలో నగరంలోని కవులు, కవయిత్రులు, రచయితలు, సాహితీ మిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మార్చి 22, 23 తేదీల్లో

వర్సిటీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం విసి పి రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ పి బ్రహ్మాజీరావు మాట్లాడుతూ మార్చి 22, 23 తేదీలలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పరిశోధనా పత్రాలను ఫిబ్రవరి 28వ తేదీ లోపు పంపించాలని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి హెచ్ స్వరూప రాణి, విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం వసంతరావు డాక్టర్ టి.సందీప్, శివరామి రెడ్డి పాల్గొ న్నారు.

మిషన్ లెర్నింగ్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో మూడు రోజుల మిషన్ లెర్నింగ్ కార్యశ్యాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు ప్రారంభ సభకు విసి పి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న పది సంవత్సరాల లో కృత్రిమ మేధ, యంత్ర అభ్యాసన వంటి వాటిదే పైచేయని, వాటిపై శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి మెండుగా ఉంటుందన్నారు. సదస్సు డైరెక్టర్ కె చైతన్య మాట్లాడుతూ విద్యార్థులకు మూడు రోజులపాటు పూర్తి శిక్షణ ఇవ్వడమే కాక ప్రాజెక్టులను సైతం చేయించడం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి సిద్ధయ్య మాట్లాడుతూ ప్రతి రంగంలో నేడు కృత్రిమ మేధా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. సదస్సులో ఎస్ ఆర్ ఎం ప్రొఫెసర్ జి జి, డీన్ ఈ శ్రీనివాసరెడ్డి, మిషన్ లెర్నింగ్ కంప్యూటర్ విజన్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విభాగ కోఆర్డినేటర్ బాలాజీ, సదస్సుకు కన్వీనర్ పి చరణ్, యు సతీష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత యూనివర్సిటీగా తీర్చిదిద్దాలి : విసి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ని ప్లాస్టిక్ రహిత ప్రాంగణంగా మార్చాలని వర్సిటీ విసి పి రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వర్సిటీ లోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు వర్సిటీలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వివిధ ప్రాంతాల్లో పడి ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్ కవర్స్ ను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఎం రవిశంకర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ డి రవిశంకర్ రెడ్డి, ఇంజనీరింగ్ ఆర్కిటెక్చర్ కళాశాలల ప్రోగ్రాం అధికారులు యుగంధర్ రెడ్డి, కెవి నిరుపమ విద్యార్థులు పాల్గొన్నారు.





ఐఎస్ఐ మార్కు కలిగిన వస్తువులు కొనండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వేసవి ముందు కొనుగోలు చేసే ఎసి మిషన్లు, కూలర్లుకు ఐఎస్ఐ మార్కు ఉందో లేదో చూసుకుని కొనుగోలుచేయాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ మురళీకృష్ణ కోరారు. కొత్త పరికరాలు కొనుగోలు చేసే ముందు అందుకు సరిపోను లోడ్‌కు అవసరమైన ట్రాన్‌ఫార్మర్లు, లైన్లు ఏర్పాటుకు తగిన సమాచారం విద్యుత్ శాఖ అధికారులకు ఇవ్వాలన్నారు. నాసిరకం వస్తువులను కొనుగోలు చేస్తే ఇబ్బందులు వస్తాయని అందువల్ల ఐఎస్ఐ మార్కు కలిగిన వస్తువులను కొనుగోలుచేయాలని కోరారు.



జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు

జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు ఎమ్మెల్సీ కెఎస్ అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి జిల్లా పరిధిలో పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ జెడ్పీ నుండి అందించినందుకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు జెడ్పి ఛైర్‌పర్సన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు దుశ్శాలువా, మెమోంటో అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ తదితరులున్నారు.



ఎఎన్‌యులో 'కంగెన్ మెడికల్ డివైస్'ను ఆవిష్కరిస్తున్న రాజశేఖరరెడ్డి పట్టేటి

వర్సిటీలో విద్యార్థులకు శుద్ధిచేసిన నీటి సౌకర్యం

'కంగెన్ మెడికల్ డివైస్' ఆవిష్కరించిన విసి పట్టేటి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శుక్రవారం కంగెన్ మెడికల్ డివైస్ ఆవిష్కరణ జరిగింది. వర్సిటీ విద్యార్థులకు మంచి విద్యతోపాటు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలనే సదుద్దేశంతో వర్సిటీ విసి, ప్రొఫెసర్ రాజశేఖర్ పట్టేటి చేతుల మీదుగా దీనిని ఆవిష్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు. నేటి పరిస్థితుల్లో గాలి ఆహారం, నీరు కాలుష్యమయం అవుతున్నాయని, దీంతో తమ విద్యార్థులు ఉన్నతమైన చదువుతోపాటు మంచి ఆరోగ్యాన్ని కూడా కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఓ మంచి ఆలోచనకు పునాది వేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే అనేక పర్యాయాలు డెమోలు చూసిన తర్వాత ఎంతో అధ్యయనం చేసి కంగన్ వాటర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. పవర్ కంగెన్ టీమ్ సభ్యులైన వీరంకి శ్రీనివాసరావు, వైవి.సాయిరాం, ఆర్ల సూర్యచంద్ర రావు ద్వారా విషయం తెలుసుకొని దీనిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బి కరుణ, ఒఎస్‌డి సునీత, వార్డెన్లు జి నాగరాజు, రవిశంకరరెడ్డి బాలమురళి తదితరులు పాల్గొన్నారు.